



విశాఖ ఎయిర్‌పోర్టులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతన్న నాయకులు



విద్యుత్ దీప కాంతులతో ప్రకాశిస్తున్న సింహగిరి

నేడే అప్పన్న కల్యాణోత్సవం

సింహాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):

సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో కె.సుబ్బారావు పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఎదురుసన్నాహోత్సవం, బంగారు తొళి క్కినియాన్‌పై తిరువీధి, ముత్యాల పల్లకిలో అమ్మవార్ల సేవ, రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు సింహగిరి మాడవీధుల్లో జాలరి కులపెద్ద కదరి లక్ష్మణరావు సారథ్యంలో రథోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి పది గంటల నుంచి ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన పుష్ప వేదికపై స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటికే సింహగిరిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కొట్నాల ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనాలు లభించవు. రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు. తలంబ్రాల అక్షతలు, లడ్డూ ప్రసాదాలను విక్రయించేందుకు వీలుగా పది కౌంటర్లను ఏర్పాటు చేశారు.

పవన్‌కు నీరాజనం

భారీగా తరలివచ్చిన అభిమానులు



పెందుర్తిలో పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

- కారులోంచే అభివాదం చేసిన ఉప ముఖ్యమంత్రి

పెందుర్తి/గోపాలపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):

అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన నిమిత్తం రోడ్డు మార్గంలో బయలుదేరిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సోమవారం పెందుర్తిలో ఘన స్వాగతం పలికింది. పవన్‌ను చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు, అభిమానులు, కూటమి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పవన్‌కు మంగళ హారతులు ఇచ్చేందుకు మహిళలు ఉదయం నుంచే వేచి ఉన్నారు. పవన్ రాక సందర్భంగా జనసేన నాయకులు పెందుర్తి కూడలిని ఫ్లెక్సీలు, జెండాలతో నింపేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కూటమి కార్యకర్తలు స్వాగత ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.40 గంటలకు పవన్ కల్యాణ్ పెందుర్తి చేరుకున్నారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల అందజేసిన పుష్పగుచ్ఛాన్ని స్వీకరించారు. ఓపెన్ టాప్ జీప్‌పై ప్రజలకు అభివాదం చేస్తారని పార్టీ శ్రేణులు భావించినప్పటికీ ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో ఆయన కారులోనుంచే అందరికీ నమస్కారం చేస్తూ సాగిపోయారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, జోగ ముత్యాలు, సేనాపతి శంకరరావు, వేగి పరమేశ్వరరావు, జనసేన నేతలు వేగి దివాకర్, అయితి సింహాచలం, గొర్లె అప్పారావు, సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, డీబీఎల్ నాయుడు, ఆర్‌ఎస్ నాయుడు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో సాదర స్వాగతం

అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన నిమిత్తం నగరానికి ... మిగతా 6వ పేజీలో

రక్తపోటు, మధుమేహం

జిల్లాలో క్రమంగా పెరుగుతున్న బాధితులు

- 10 రకాల వ్యాధులపై 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సర్వే
- జిల్లాలో 18 ఏళ్లు పైబడిన వారు 13,75,235 మంది..
- ఇంతవరకు 9,02,775 మందికి స్క్రీనింగ్ పూర్తి
- 94,152 మంది బీపీ, 61,954 మంది షుగర్ బాధితులు
- క్యాన్సర్ పీడితులు 489, క్షయ బాధితులు 2,345 మంది



సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రక్తపోటు, మధుమేహ(షుగర్) బాధితులు క్రమంగా పెరుగుతున్నారు. దీంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబరు 14న 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సర్వే ప్రారంభించింది. ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న వ్యాధులకు మూలాలు, వాటి వెనుక ఉన్న కారణాలు తెలుసుకొని నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ప్రధానంగా గుండె, మూత్రపిండాలు, శ్వాస సంబంధ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి, మధుమేహం, రక్తపోటు బాధితులు నానాటికీ పెరిగిపోతున్నారు. ఆయా వ్యాధులు, సమస్యలపై సర్వే నిర్వహించగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రజల ఆహారపు అలవాట్లు, జీవన విధానం కారణంగా వ్యాధులబారిన పడుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అనారోగ్యం బారినపడిన తరువాత చికిత్స అందించడం కంటే, వ్యాధులబారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటే చాలా వరకు వ్యాధులను నియంత్రించవచ్చని అభిప్రాయపడుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని 10 రకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై సర్వే చేస్తోంది. ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సుమారు 120 ప్రశ్నల ద్వారా ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల వరకు పూర్తయిన సర్వే వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. ఈ నివేదిక ప్రకారం మధుమేహం, రక్తపోటు బాధితులు అధికంగా వున్నట్టు వెల్లడైంది.

జిల్లాలో 54 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) పరిధిలో 18 ఏళ్లు పైబడిన వారు 13,75,235 మంది వున్నారు. వీరిలో ఇప్పటి వరకు 9,02,775 మందికి (65.65 శాతం) స్క్రీనింగ్ పూర్తి చేశారు. మిగిలిన 4,72,460 మందికి స్క్రీనింగ్ సర్వే కొనసాగుతున్నది. ఇప్పటి వరకు పూర్తయిన స్క్రీనింగ్ వివరాల ప్రకారం 94,152 మంది రక్తపోటు(బీపీ)తో బాధపడుతున్నారు. సర్వే నిర్వహించిన వారిలో సుమారు 10.43 శాతం మంది వున్నారు. వీరిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది వున్నారు. ఇక జిల్లాలో 61,954 మంది (6.86 శాతం) మధుమేహ బాధితులు వున్నారు. 30 సంవత్సరాలు దాటిన వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిపిన ఆరోగ్య సర్వేలో వెల్లడైన వివరాలతో పోలిస్తే ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో రక్తపోటు, మధుమేహం ... మిగతా 6వ పేజీలో

కల్యాణోత్సవానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు..

- విశాఖకు చెందిన తొమ్మిది మంది 5న వ్యాన్‌లో భద్రాద్రి పయనం
- స్వామివారి దర్శనం తరువాత తిరుగుముఖం
- తెల్లవారుజామున 'పేట వద్ద టిప్పర్‌ను ఢీకొన్న వ్యాన్
- ఇద్దరు మహిళల మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురై దెబ్బతిన్న వ్యాన్ ముందు భాగం



మృతులు జోగా పైడితల్లి, గుర్రాల రత్నం (ఫైల్ ఫొటోలు)

పాయకరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):

భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించి, వ్యాన్‌లో ఇంటికి తిరిగి వెళుతుండగా పాయకరావుపేట వై జంక్షన్ సమీపంలో టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులు. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. విశాఖ నగరంలోని వన్‌టౌన్ పూర్ణా మార్కెట్ ప్రాంతానికి చెందిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, కుటుంబ సభ్యులు కలిసి మొత్తం తొమ్మిది మంది శనివారం రాత్రి మ్యాక్సీ క్యాబ్‌లో భద్రాచలం బయలుదేరి వెళ్లారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించి, అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భోజనాలు చేసిన తరువాత రాత్రి 10 గంటలకు ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం తెల్లవారుజామున పాయకరావుపేటలోని వై జంక్షన్ దాటిన తరువాత ముందు వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేశారు. ఆ వెంటనే నెమ్మదిగా కదులుతున్న టిప్పర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న గుర్రాల రత్నం(44), ఆమె వెనుక సీట్లో కూర్చున్న జోగా పైడితల్లి(72) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. క్యాబ్ డ్రైవర్ చింతకాయల ముత్యాలరావు, మొగవాని కనకమహాలక్ష్మి (మృతిచెందిన పైడితల్లి కుమార్తె), దుంప ... మిగతా 6వ పేజీలో

లక్ష్యాన్ని మించి ఉపాధి

- 120 లక్షల పని దినాలకుగాను 124.67 లక్షల పనిదినాలు..
- రాష్ట్రస్థాయిలో ఆరో స్థానంలో జిల్లా
- సగటు వేతనంలో నాలుగో స్థానం..
- పనిదినాల కల్పనలో ఐదో స్థానం
- పల్లె పండుగలో రూ.181.22 కోట్లతో 229.09 కి.మీ.ల రోడ్లు
- 745 గోకులం షెడ్లు, 308 స్కూళ్లకు ప్రహరీ గోడలు
- ఈ ఏడాది 127 లక్షల పనిదినాలు లక్ష్యం



కోటవురట్ల మండలం సుంకపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్ర స్థాయిలో అనకాపల్లి జిల్లా పలు విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో జిల్లాలో సాధించిన ప్రగతిపై చర్చకు వచ్చింది. కలెక్టర్ విజయకృష్ణన్ నేతృత్వంలో ఉపాధి కల్పనలో జరిగిన అభివృద్ధిని ఈ సందర్భంగా చర్చించి జిల్లా అధికారులను అభినందించారు.

జిల్లాకు 120 లక్షల పని దినాలు లక్ష్యంకాగా మార్చి చివరినాటికి 124.67 లక్షల పనిదినాలు కల్పించారు. తద్వారా రాష్ట్ర స్థాయిలో అనకాపల్లి జిల్లా 6వ స్థానంలో నిలిచింది. కూలీలకు మొత్తం రూ.350 కోట్లు వేతనాల రూపంలో అందాయి. ఒక కూలీకి సగటున రూ.281 రోజు వారీ వేతనం లభించింది. ఈ విషయంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచింది. ఉపాధి కూలీలకు సగటున 59 రోజులు పని కల్పించి రాష్ట్ర స్థాయిలో 5వ స్థానాన్ని, 29,740 కుటుంబాలకు 100 రోజులు పని కల్పించి 5వ స్థానంలో నిలిచింది. జాబ్ కార్డులున్న వారిలో 74 శాతం మందికి పని కల్పించి 6వ స్థానంలో నిలిచింది. రహదారులు లేని 17 మారుమూల గిరిజన గ్రామాలకు రూ.21.89 కోట్లతో 22.18 కిలో మీటర్ల మేర రోడ్లు వేశారు. ఉపాధి హామీ పథకంలో 1,648 మంది రైతులకు చెందిన భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టారు. 120 ఎకరాల ప్రభుత్వ భూముల్లో కొబ్బరి మొక్కలు నాటించారు.

పల్లె పండుగలో భాగంగా..

ప్రభుత్వం గ్రామాల్లో అధ్వాన రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి 'పల్లె పండుగ' కార్యక్రమం కింద పెద్దఎత్తున నిధులు మంజూరు చేసింది. ఉపాధి కన్వర్జెన్సీ నిధులు రూ.181.22 కోట్లతో 229.09 కిలో మీటర్ల పొడవున సిమెంట్, బీటీ రోడ్లు వేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 745 గోకులం షెడ్లు నిర్మించారు. రూ.24.95 కోట్లతో 308 పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారు. రూ.1.67 కోట్ల వ్యయంతో 89 నర్సరీల్లో మొక్కలు ... మిగతా 6వ పేజీలో

గర్నికంలో యువకుడి హత్య

- జులాయిగా తిరిగే స్నేహితుల మధ్య మద్యం మత్తులో గొడవ
- డబ్బుల విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ
- ఒకరు బీరు సీసా పగలగొట్టి మరొకరిపై దాడి
- తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- వీరిలో ఒకరు మైనర్



పవన్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు. (ఇన్‌సెట్లో) పవన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

రావికమతం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):

ఆ నలుగురు జులాయిగా తిరుగుతూ చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డారు. చోరీ సొమ్ముతో మద్యం సేవిస్తూ జల్సాగా గడుపుతుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించారు. చోరీ చేసిన సొమ్ముకు సంబంధించి గొడవ పడ్డారు. ఇది కాస్తా ముదరడంతో ఓ యువకుడు బీరు సీసాను పగలగొట్టి, మరో యువకుడిని పొడవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని మేడివాడ గ్రామానికి చెందిన కొలిపాక త్రిమూర్తులు కుమారుడు పవన్‌కుమార్ (22) ఏడో తరగతితో చదువు ఆపేసి జులాయిగా తిరగడం మొదలుపెట్టాడు. రావికమతానికి చెందిన మరో ముగ్గురు ... మిగతా 6వ పేజీలో

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

రూ.లక్ష జరిమానా

తీర్పు వెలువరించిన 10వ అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య

కశింకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.లక్ష జరిమానా విధిస్తూ 10వ అదనపు జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య తీర్పు ఇచ్చారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం తెలిపారు. 2018 జూన్ 8న తమిళనాడు రాష్ట్ర మధురైకి చెందిన శర్వణ్‌కుమార్ గణపతి, వెల్లూరు జిల్లా ఆచూరే పోస్టుకు చెందిన కణ్ణన్ మునిరాజ్ కంటైనర్ లారీలో కశింకోట సమీపంలో ఉన్న కాశీప్రసాద్ పెట్రోలు బంకు వద్దకు చేరుకున్నారు. భోజనం అనంతరం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మునిరాజ్ సరదాగా కితకితలు పెట్టడంతో శర్వణ్ కుమార్ కింద పడిపోయాడు.

దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం మునిరాజ్ పెట్రోలు బంకు సమీపంలో గుట్టపై విశ్రమిస్తుండగా, శర్వణ్‌కుమార్ కాంక్రీట్ రాయితో దాడి చేసి తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రరక్తస్రావంతో ఉన్న మునిరాజ్‌ను స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడు. అప్పటి సీఐ జి.రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. వాదనల అనంతరం శర్వణ్‌కుమార్‌కు యావజ్జీవ కారాగారం, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీవిద్య తుది తీర్పు ఇచ్చారు.



ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడి ఆత్మహత్య


మృతుడు రమణబాబు (ఫైల్)

ఎస్.రాయవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఆర్థిక ఇబ్బందులు తాళలేక కె.రమణబాబు (33) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి.

నర్సీపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి మృతి చెంది ఉన్నాడని అందిన సమాచారం మేరకు ఎస్ఐ జి.శ్రీనివాసరావు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అతడి వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన రమణబాబుగా గుర్తించినట్టు చెప్పారు. ఇతడు ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటి రాగా సోమవారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. రమణబాబు డిప్లొమా చదువుకొని కొన్నాళ్లు బెంగళూరులో ఉద్యోగం చేశాడని, ఆరు నెలల క్రితం నుంచి ఉద్యోగం మానేసి ఇంటి వద్ద ఉంటున్నాడన్నారు. దీనిపై అతడి సోదరుడుని ఆరా తీయగా.. రమణబాబుకు కొన్ని అప్పులు ఉన్నాయని చెబుతుండేవాడని చెప్పారన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. రమణబాబు మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి మార్చ్యురీకి తరలించినట్టు చెప్పారు.

రక్తపోటు, మధుమేహం

... 5వ పేజీ తరువాయి

బాధితులు రెట్టింపు అయినట్టు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఇక జిల్లాలో నోటి క్యాన్సర్‌తో 138 మంది, రొమ్ము క్యాన్సర్‌తో 144 మంది, గర్భాశయ సంబంధిత క్యాన్సర్‌తో 207 మంది బాధపడుతున్నట్టు గుర్తించారు. మానసిక పరిస్థితిపై నిర్వహించిన సర్వేలో 2,903 మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తేల్చారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో 191 మంది, కుష్టువ్యాధితో 48 మంది బాధపడుతున్నారు. జిల్లాలో క్షయతో బాధపడుతున్న వారు 2,345 మంది ఉన్నారు. వినికిడి సమస్యతో 1,380 మంది బాధపడుతున్నారని గుర్తించారు.

స్ర్కీనింగ్ పరీక్షలు నిరంతర ప్రక్రియ

జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పరిధిలో స్ర్కీనింగ్ పరీక్షలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రామ్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ప్రశాంతి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన సర్వే కార్యక్రమం కింద జూన్ చివరినాటికి అందరికీ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆ తరువాత కూడా పీహెచ్‌సీల పరిధిలో స్ర్కీనింగ్ పరీక్షలు కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

లక్ష్యాన్ని మించి ఉపాధి

... 5వ పేజీ తరువాయి

పెంచి, సామాజిక వనాలు, రోడ్ల పక్కన నాటుతారు.

ఈ ఏడాది 127 లక్షల పనిదినాలు లక్ష్యం

జిల్లాలో ప్రస్తుత (2025-26) ఆర్థిక సంవత్సరంలో 127 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గ్రామాల్లో 215 పశువుల నీటి తొట్టెలు, 7,200 పంట కుంటలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో 451.5 కిలో మీటర్ల పంట కాలువల పునరుద్ధరణ, 977 చెరువుల అభివృద్ధి పనులు మంజూరయ్యాయని తెలిపారు.

గర్నికంలో యువకుడి హత్య

... 5వ పేజీ తరువాయి

యువకులతో కలిసి స్నేహం చేస్తున్నాడు. అందరూ జులాయిగా తిరుగుతూ చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుంటారు. మద్యంతోపాటు గంజాయి సేవించే అలవాటు కూడా వుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో గొల్లలపాలెం వెళ్లే రోడ్డులో మద్యం సేవిస్తూ చిల్లర దొంగతనాల విషయమై ఘర్షణ పడ్డారు. కొద్దిసేపటి తరువాత ఎవరి దారిన వాళ్లు వెళుతున్నారు. ఈ క్రమంలో రావికమతానికి చెందిన ఒక యువకుడు, పవన్‌కుమార్ మళ్లీ గొడవ పడ్డారు. రావికమతం యువకుడు మద్యం సీసాను పగలగొట్టి పవన్‌కుమార్ గొంతుపైన, ఎడమవైపున ఛాతి భాగంలో పొడిచాడు. దీంతో పవన్‌కుమార్ తీవ్రరక్తస్రావంతో స్పృహ కోల్పోయి మృతిచెందాడు. దీంతో మిగిలిన ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు.. కొద్ది సేపటి తరువాత అటుగా బహిర్భూమికి వెళుతున్న వ్యక్తులు.. రక్తపు మడుగులో పడిఉన్న పవన్‌కుమార్‌ను చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం చుట్టూ చెల్లాచెదురుగా పడివున్న 14 రూ.500 నోట్లను, హత్యకు ఉపయోగించిన మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్ వచ్చి పలు ఆధారాలు సేకరించింది. పవన్‌కుమార్‌తో గొడవ పడిన ముగ్గురిలో ఒక మైనర్ వున్నాడని, అనుమానితులుగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని సీఐ చెప్పారు. మృతదేహానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హతుడి తండ్రి త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నామని సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

పెందుర్తిలో పవన్‌కు నీరాజనం

... 5వ పేజీ తరువాయి

వచ్చిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 8.15 గంటలకు ఆయన విశాఖ చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, జనసేన నేతలు కోన తాతారావు, బొలిశెట్టి సత్యనారాయణ, పి.ఉషాకిరణ్, సుందరపు సతీశ్, బి.వసంతలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో దుంబ్రిగుడ బయలుదేరి వెళ్లారు.

సెజ్‌లో పయనీర్ ఉద్యోగుల సమ్మె

- వేతనాలు పెంచడం లేదని ఆవేదన
- అరకొరగా ఇంక్రిమెంట్లు, బోనస్
- విధులకు వెళ్లకుండా గేటు ఎదుట ఆందోళన


గేటు ఎదురుగా ఆందోళన పయనీర్ ఉద్యోగులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కోర్కెల సాధన కోసం అధిస్తాన్ ప్రాంగణంలో ఉన్న పయనీర్ ఎలాస్టిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులు సోమవారం మధ్యాహ్నం నుంచి సమ్మెకు దిగారు. మొదటి షిఫ్ట్ ఉద్యోగులు విధులు ముగించుకుని వెలుపలికి వచ్చేసరికి రెండో షిఫ్ట్ ఉద్యోగులు వచ్చారు. అంతా కలిసి విధులు బహిష్కరించి కర్మాగారం ముందు ఆందోళనకు దిగారు. పదేళ్ల నుంచి పనిచేస్తున్నామని, వేతనం రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారని కార్మికులు వాపోయారు. జీతాలు పెంచమని అడిగితే.. నచ్చితే ఈజీతాలకు పనిచేయండి, లేకపోతే రిజైన్ చేసి వెళ్లిపోండి అని యాజమాన్యం చెబుతున్నదన్నారు. ఇంక్రిమెంట్లు సక్రమంగా వేయడం లేదని, అధిస్తాన్ ఆవరణలో ఉన్న కర్మాగారాలన్నీ తమ ఉద్యోగులు, కార్మికులకు దసరా బోనస్ రూ.18,500 ఇస్తుండగా, పయొనీర్ యాజమాన్యం రూ.6,999 మాత్రమే ఇస్తున్నదన్నారు. నైట్ షిఫ్ట్ భత్యం రోజుకు రూ.50 మాత్రమే ఇస్తున్నారని, దీనిని రూ.100కు పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా కంపెనీలో మొత్తం 600 మంది వరకు కార్మికులు, ఉద్యోగులు ఉండగా, వీరిలో సుమారు 400 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి మూడో షిఫ్ట్ కార్మికులు కూడా విధులను బహిష్కరించారు. అంతా కలిసి మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్నారు.

నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లపై అవగాహన


హరిపాలెంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఆయేషా

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి):టీడీఆర్ బాండ్లపై నిర్వాసితులు పూర్తి అవగాహన కలిగి ప్రభుత్వ ఆలోచనలకు మద్దతు పలకాలని అనకాపల్లి ఆర్డీఓ షేక్ ఆయేషా అన్నారు. సోమవారం హరిపాలెం రామాలయం వద్ద అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాసితుల ఆమోదం లేకుండా బలవంతంగా భూములను తీసుకోడానికి తాము ప్రయత్నం చేయబోమని స్పష్టం చేశారు. నిర్వాసితులకు ఇచ్చే నష్టపరిహారం నగదు రూపంలో కాకుండా బాండ్ల రూపంలో ఇచ్చే వీలుందన్నారు. 2018 నుంచి రాష్ట్రంలో ఏ ప్రాంతంలో అయినా ఇదే విధంగా చేస్తున్నారన్నారు. అయితే నిర్వాసితులు తాము విస్తరణకు వ్యతిరేకం కాదని, టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా తమకు నేరుగా నగదును అందజేయాలని కోరారు.

నిర్మాణాత్మకాభివృద్ధికి సహకరించండి : ఆర్డీవో

మునగపాక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాత్మక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో ఆయిషా పిలుపునిచ్చారు. మండలంలో నాగులాపల్లి సచివాలయంలో సోమవారం రోడ్డు విస్తరణ నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రమాదాల నివారణతోపాటు పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగావకాశాలు వంటి పలు ప్రయోజనాలు రోడ్డు విస్తరణతో ముడిపడి ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. త్వరగా పనులు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిహారం చెల్లింపులు మాత్రం నగదు రూపంలోనే జరగాలన్నది ప్రధాన డిమాండ్ అని జేఏసీ సభ్యుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు తెలిపారు. ఈ సమావేశంలో వీఎంఆర్డీఏ ప్రతినిధులు, తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల కోసం ప్రభుత్వ భూమికి అన్వేషణ

కోటవురట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు సోలార్ ప్లాంట్ల కోసం ప్రభుత్వభూములు కేటాయించాలని ఈపీడీసీఎల్ అధికారులు సోమవారం తహసీల్దార్ తిరుమలబాబును కోరారు. రాష్ట్రప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వాలని యోచిస్తున్నది. ఈ నేపథ్యంలో ఈపీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ తిరుమలరావును కోటవురట్ల ఏఈ పరమేశ్వరరావు, నాతవరం రూరల్ ఏడీఈ సునీల్‌కుమార్ కలిసి 30 ఎకరాలు కావాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వ భూములు లేకుంటే ఎవరైనా రైతులు తమ భూములను లీజుకు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందించి ప్రభుత్వ భూములను గుర్తించి తెలపాలంటూ ఆయా గ్రామ సర్వేయర్, వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఉపమాకలో శివ కల్యాణం

నక్కపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాకలో మంగళవారం శివాలయంలో శివ,పార్వతుల కల్యాణం జరగనుంది. ప్రతీ ఏటా చైత్రమాసం శుక్ల పక్షం ఏకాదశి రోజు శివయ్య కల్యాణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకు సంబంధించి ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామునముక్కంటికి పంచామృతాభిషేకం అనంతరం సప్త హారతులుంటాయని ఆలయ అర్చకులు మహేశ్, సంతోశ్ చెప్పారు.

అరటి రైతులను ఆదుకోండి

నక్కపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిక కొత్తూరు గ్రామంలో ఈదురుగాలులకు నేలమట్టమైన అరటి తోటల రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.రైతుల పంట నష్టాన్ని అంచనా వేసి, వారికి నష్టపరిహారం మంజూరు చేయాలని కోరారు.

ఏలేరు కాలువ మరమ్మతు పనులు ప్రారంభం


పాములవాకలో ఏలేరు కాలువ మరమ్మతు పనులకు కొబ్బరి కొడుతున్న జనార్దన్, శ్రీనివాసరావు

కోటవురట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాకలో రూ.50 లక్షలు సీఆర్ఎస్ నిధులతో సోమవారం ఏలేరు కాలువ మరమ్మతు పనులను మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, వేచలపు జనార్దన్ ప్రారంభించారు. గతేడాది ఏలేరు కాలువపైనున్న కల్వర్టు వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో రైతులు పండించిన పంటలు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాఖ ఇండస్ట్రియల్ వాటర్ సప్లయ్ కంపెనీ పర్యవేక్షణలో కల్వర్టు నిర్మాణం, ప్రొటెక్షన్ హెడ్ రైలింగ్, వంతెన హెడ్ పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే రైతులు ఇబ్బందులు తీరనున్నాయి.

కృష్ణంపాలెం గ్రామాన్ని తరలించాలని గ్రామస్థుల ధర్నా


అనకాపల్లిలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కృష్ణంపాలెం గ్రామస్థులు

రాంబిల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజెడ్ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో అనారోగ్యానికి గురవుతున్నందున గ్రామాన్ని తరలించాలని కృష్ణంపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం వారు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణంపాలెం మాజీ సర్పంచ్ కశిరెడ్డి ప్రసాద్, పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ఆనుకొని 200 పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో ఉన్న ఫార్మా కంపెనీల కాలుష్యంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామన్నారు. కంపెనీల యాజమాన్యాలు రాత్రి వేళల్లో కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయని, దీంతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రజలు ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, కిడ్నీ, చర్మవ్యాధులు, గొంతు క్యాన్సర్, తదితర అనారోగ్య సమస్యలను ఎదురుక్కోవాల్సి వస్తుందన్నారు. బోర్లలో నీరు కూడా పాడైపోయిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కంపెనీలు ఏర్పాటు చేసినపుడు ప్రజాభిప్రాయ సేకరణలో పర్యావరణానికి సంబంధించి అధికారులు ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పి నమ్మించారని, ఇప్పుడు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కాలుష్యంతో నల్లటి బొగ్గులాంటి పౌడర్ ఇళ్లపైకి వచ్చేస్తుందని, పంటలపై కూడా ఈ పౌడర్ పడుతుండటంతో దెబ్బతింటున్నాయన్నారు. పంచాయతీలో ఏపీఐఐసీ 80 శాతం భూముల సేకరించిందని, మిగిలిన వారి భూములు, ఇళ్లు సేకరించి గ్రామాన్ని వేరే చోటకు తరలించాలని డిమాండ్ చేశారు. .ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా చోడమాంబిక పుట్టుక జాతర


గుర్రపు పరుగు పోటీలు జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం/ రూరల్, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి):మండలంలోని చోడపల్లి చోడమాంబిక అమ్మవారి పుట్టుక జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిమందిగా తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ప్రధాన రహదారిలో విచిత్ర వేషధారణలు అలరించాయి. ఆలయం వద్ద భారీగా బాణసంచా కాల్చారు. అర్ధరాత్రి సమయంలో అమ్మవారి జ్యోతిని దర్శించుకుని భక్తులు తిరిగి వెళ్లారు. ప్రతీ వీధిలో బుర్రకథలు, డ్యాన్సుబేబీ డ్యాన్సులు, ఆర్కెష్ట్రాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అడుగడుగునా ఏర్పాటుచేశారు. పోలీసులు అచ్యుతాపురం వెళ్లే వాహనాలను కొండకర్ల మీదుగా దారి మళ్లించారు.

గుర్రపు పరుగు పందేల విజేత రామన్నపాలెం

చోడమాంబిక అమ్మవారి పండగ సందర్భంగా సోమవారం నిర్వహించిన గుర్రపు పరుగు పోటీల్లో రామన్నపాలెంకి చెందిన విక్రం గుర్రం ప్రథమస్థానం సాధించి రూ. 15వేలు బహుమతి గెలుచుకుంది. చేనులు అగ్రహారానికి చెందిన మణిజెస్సీ గుర్రం ద్వితీయ స్థానం సాధించి రూ. 12 వేలు, ఎలమంచిలికి చెందిన మోదమాంబ మురుగన్ తృతీయ స్థానం సాధించి పది వేలు గెలుచుకున్నాయి. ఈపోటీల్లో 12 గుర్రాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాసరావు, ధర్మిరెడ్డి నాయుడుబాబు, లాలం సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



పాయకరావుపేటలో నినాదాలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పాయకరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రపంచ ఆరోగ్య దినోత్స వాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సౌందర్య మాట్లాడుతూ మంచి అలవాట్లు, పౌష్టికాహారం, ఆరోగ్య సూత్రాలను పాటించి అందరూ ఆరోగ్యండా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, ఈఓ రమణ, హెచ్ఎం నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యుడు రవిబాబు అన్నారు. మండలంలోని హరిపాలెంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఇచ్చిన పిలుపు మేరకు ఈ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు మానస, సిబ్బంది ఎస్.శ్రీనివాస్, రామలక్ష్మి, సునీత, ఉమా మహేష్, శాంతి, గణేష్, ఇందిర, నాగేశ్వరరావు, వరలక్ష్మి, జోష్న, నాగ వరలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

మునగపాకలో..

విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎన్.విమలగిరి పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాయామం శరీర ధృడత్వాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆర్.దేవకాంత, పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో మాకవరపాలెం అవంతి కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, అనాథలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జననీ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ ధర్మతేజ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో అవంతి కళాశాల రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ కె. రామకృష్ణ, కృష్ణమోహన్, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీరు పాల్గొన్నారు.

పంచదార్ల కొండపై గ్రావెల్ తవ్వకాలు ఆపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు


గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

రాంబిల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచదార్ల కొండపై గ్రావెల్ తవ్వకాలు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలువురు పార్టీ నేతలతో కలిసి పంచదార్ల కొండ వద తవ్వకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది అధికార పార్టీ నేతలు కొండలను గుల్ల చేస్తూ కోట్లాది రూపాయలు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన లాలంకోడూరు, ఎరకన్నగారి ఇళ్లు, చేటమట్ట, సీతపాలెం, రామచంద్రపురం, తోటవీది, పెదయాతపాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, నేతలు చందక రామకృష్ణ, వై.రాము, ఎన్.నారాయణరావు, సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

కలెక్టర్‌కు టీడీపీ నేత అక్రమాలపై ఫిర్యాదు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగులూరు, వెలంపాలెం (జేవీపాలెం) గ్రామ సర్పంచ్ భర్త అయిన వజ్రపు శంకరరావు చేసిన అక్రమాలపై అదే గ్రామానికి చెందిన కట్టుమూరి కృష్ణ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ భర్త వజ్రపు శంకరరావు గ్రామంలో గల కొండ పోరంబోకుతోపాటు జిరాయితీ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా యంత్రాల సాయంతో గ్రావెల్, మట్టి అక్రమంగా తవ్వకాలు జరిపిస్తున్నాడని పేర్కొన్నారు. వీటిని విక్రయించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడన్నారు. అంతేకాకుండా జంగులూరులోని సర్వే నంబరు 388లో ఎకరా ఇరవై సెంట్ల ప్రభుత్వ భూమిని శంకరరావు ఆక్రమించుకొన్నారని, అందులోని 20 సెంట్లలో ఇల్లు నిర్మించి, వేరొకరికి విక్రయించారన్నారు. ఈ విషయమై స్పందించి సర్పంచ్ భర్త అక్రమాలపై విచారణ జరిపించి, ఆయనపై చర్యలు తీసుకోవాలని కృష్ణ కోరారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో నునపర్తి టీమ్‌కు తృతీయ స్థానం

అచ్యుతాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నునపర్తి జట్టు తృతీయ స్థానం సాధించింది. శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 5,6లలో నంద్యాల జిల్లా గని గ్రామంలో ఆంధ్ర, తెలంగాణా జట్ల మధ్య టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో నునపర్తి జట్టు తృతీయ స్థానం సాధించింది. అలాగే ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన డి. రమేష్ బెస్ట్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. జట్టు సభ్యులను క్లబ్ ఛైర్మన్ నగేష్, జల్లా ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదపూడి శంకరరావు, మండల ప్రధాన కార్యదర్శి మాసవరపు అప్పారావు, ప్రధాన కార్యదర్శి గారపాటి అప్పలరాజు, కార్యవర్గసభ్యులు అభినందించారు.

ఉపాధి హామీతో అనేక కుటుంబాలకు భరోసా

- ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు


తిమ్మరాజుపేటలో ఉపాధి పనులను ప్రారంభించిన శ్రీనివాసరావు

మునగపాక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అనేక కుటుంబాలకు భరోసాని ఇస్తుందని ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనువాసరావు అన్నారు. సోమవారం తిమ్మరాజుపేట ఉపాధి పనులను ఆయన ప్రారంభించారు. అలాగే మునగపాకలో ఉపాధి పనులను ఎంపీపీ మళ్ల జయమ్మ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి శ్రేణులు టెక్కలి పరశరాం, ఏవీ.సత్యనారాయణ, దాడి శివ, సూరిశెట్టి రాము, బీవీ.రమణ, ప్రజాప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు పాల్గొన్నారు.

బీసీ రుణాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన

కోటవురట్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు యువతీ, యువకుల నుంచి విశేష స్పందన లభించింది. మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 87యూనిట్లు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 224 మంది లబ్ధిదారులు హాజరయ్యారు. వీరికి వివిధ బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలు ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ రఘురామ్ సమక్షంలో జరిగాయి.

'విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి'

రాంబిల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, లాలంకోడూరు సర్పంచ్ రుత్తల గుణాకర్ అన్నారు. సోమవారం లాలంకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ స్వామినాయుడు, హైస్కూల్ హెచ్ఎం పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామాలయానికి భజన చెట్టు వితరణ


రాము అందజేసిన భజన చెట్టు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సైతారుపేట రామాలయానికి స్థానిక ఎంపీటీసీ సభ్యుడు శానాపతి రాము రూ. 60 వేలు సొంత నిధులతో భజన చెట్టును తయారు చేయించి వితరణగా ఇచ్చారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులకు రాము అందజేశారు. రామును గ్రామ పెద్దలు, గ్రామస్థులు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్‌లు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సోమవారం సర్పంచ్ కర్రి సత్యనారాయణ యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది మంది పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్‌ను కుట్టించి వారికి అందజేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల కళాశాలలో పుస్తకాల పంపిణీ

ఎలమంచిలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్ బాలికల కళాశాలలో ప్రభుత్వం అందించిన నోటు, పాఠ్య పుస్తకాలను 52 మంది విద్యార్థులకు టీడీపీ నాయకుడు ఆడారి ఆదిమూర్తి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యాప్తికి మంచి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. హిమబిందు, అధ్యాపకులు సత్యనారాయణ, పద్మాకర్, శ్రీనివాస్, రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

26 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు గ్రామాలలో సోమవారం జరిపిన దాడులలో 26 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గుంటపల్లి గ్రామ శివారులో పది లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు. అలాగే పెదరాంభద్రపురానికి చెందిన ఒక మహిళను 10 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు తెలిపారు. అరట్లకోట సమీపంలో అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్ ఒక వ్యక్తిని ఆరు లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు చెప్పారు. ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను పట్టించుకోరా?

- మండల వైస్ ఎంపీపీ అప్పలరాజు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే పట్టించుకోరా? అంటూ వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. పెద ఉప్పలం, చినుప్పలం గ్రామాల్లో కొన్ని ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్నారు. గతంలో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను కాపాడవలసిన అధికారులే ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ జరిపించాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

కల్యాణోత్సవానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు..

... 5వ పేజీ తరువాయి

లిజ, అర్జి ప్రవల్లిక (వీరిద్దరు తల్లీ కూతుళ్లు) తీవ్రంగా గాయపడ్డారు. వెంకటలక్ష్మి, డి.విజయ, ఐ.వెన్నెల, జె.సాయిదుర్గ, జె.ధనలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పాయకరావుపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో జోగా పైడితల్లిది అల్లిపురం సింహాళవీధి. ఈమె జీవీఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసి రిటైర్ ఆయ్యారు. మరో మృతురాలు గుర్రాల రత్నం పాత పోస్టాఫీసు ప్రాంతంలో నివాసం వుంటున్నారు.



శేషుకుమార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న

శేషుకుమార్ మృతి పార్టీకి తీరని లోటు

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు రుత్తల శేషుకుమార్ మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన శేషుకుమార్ సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ముందుకు శేషుకుమార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ మాకవరపాలెం టీడీపీకి శేషుకుమార్ బలమైన నాయకుడిగా ఎదగాడన్నారు. ఏఎంసీ చైర్మన్ వచ్చినప్పటికీ పదవి చేపట్టకముందే చనిపోవడం చాలా బాధాకరమని వాపోయారు. పార్టీలో ఆయన లోటు తీర్చడం కష్టతరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్పై పాత్రుడు, సర్పంచ్ అల్లంపల్లి శిరీషా, ఉప సర్పంచ్ లాలం రాము, నాయకులు అల్లు రాము నాయుడు, జోగిపాత్రుడు, రుత్తల నాని తదితరులు పాల్గొన్నారు.

రూ.88.72 లక్షలతో 12 అభివృద్ధి పనులు

నర్సీపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డుల్లో రూ.88.72 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఏరియా ఆస్పత్రి ప్రహరీ గోడను ఆనుకొని రూ.24.96 లక్షలతో నిర్మాణం చేయనున్న గచ్చపువీధి డ్రైనేజీ నిర్మాణం, రెండో వార్డు బీసీ కాలనీలో ఏడు పనులు రూ.24.4 లక్షలు, పీనారిపాలెంలో ఓ పని రూ.14.4 లక్షలు, 28వ వార్డులో రూ.24.96 లక్షలతో మూడు అభివృద్ధి పనులను 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వీధి లైట్లు వేసే నాథుడు లేడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలకే స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో రూ.4 కోటుతో అభివృద్ధి పనులు చేసుకోగలుగుతున్నామన్నారు. రానున్న ఐదేళ్లలో మునిసిపాలిటీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆమె పేర్కొన్నారు. పట్టణంలో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి చేస్తున్నారని విజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు డీబీరు శ్రీకాంత్, లాలం వరహాలమ్మ, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎ.మంగరాజు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి: ఆర్డీవో రమణ



అర్జీదారుల సమస్యలు వింటున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజల నుంచి వస్తున్న అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 19 అర్జీలు వచ్చాయి. ఏపీ టిడ్కో ఇంటి కోసం కమిషనర్ పేరుపై రూ.లక్ష డీడీ అందించా మని, టిడ్కో ఇల్లు రద్దు చేసి కాలనీ స్థలం ఇచ్చారని, డీడీ సొమ్ము వెనక్కి ఇవ్వలేదని నర్సీపట్నానికి చెందిన పెద్దె సుభ ఫిర్యాదు చేశారు. అలాగే స్థానిక కొత్తవీధికి చెందిన వాకలపూడి లక్ష్మీకుమారి వితంతు పింఛను ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

మాతాశిశు మరణాలను నివారించండి

నర్సీపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలను నివారించాలని ఆర్డీవో వీవీ రమణ సూచించారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం ఇవ్వడం అవసరమన్నారు. పిల్లలు, వృద్ధులు వేసవి వడగాడ్పుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టిసారించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లపై వైర్లు తొలగించాలని మహిళల ఆందోళన



అధికారుల నిర్లక్ష్యంపై నినాదాలు చేస్తున్న మహిళలు

చోడవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఐటీ కాలనీలో ఇళ్లపై ప్రమాదకరమైన విద్యుత్ వైర్లు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈపీఈడీసీఎల్ కార్యాలయం ఎదుట సోమవారం మహిళలు ఆందోళనకు దిగారు. సమస్య తెలిపినా విద్యుత్ అధికారులు స్పందించకపోవడం దారుణమని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఇళ్లపై వైర్లు తొలగించడానికి పేద పారిశుధ్య కార్మికులు డబ్బులు చెల్లించాలని అధికారులు చేతులు దులుపుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా వైర్లను తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైకులు, నిందితులను చూపుతున్న డీఎస్పీ శ్రావణి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసినట్టు డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేకుండా రెండు బైక్‌లపై బుచ్చెయ్యపేట నుంచి రాజాం వైపు వెళ్తున్న యువకులను కందిపూడి జంక్షన్‌లో పోలీసులు ఆపి వివరాలు ఆరా తీయగా పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. దీంతో పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్నట్టు తేలిందని డీఎస్పీ చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ స్టేషన్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వీటిని ఆయా స్టేషన్లకు పంపిస్తామని తెలిపారు. నిందితులపై కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఈ మేరకు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

తాండవ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

▸▸ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ

నాతవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తాండవ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ సూచించారు. అధికారులతో కలసి సోమవారం తాండవ ఎడమ కాలువ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లోగా గేట్ల పనులు పూర్తయితే సాగునీటి వృథాను అరికట్టవచ్చన్నారు. అలాగే తాండవ కుడి కాలువ 1.414 కిలోమీటరు వద్ద రూ.20 లక్షలతో జరుగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులను కూడా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు ఏఈ ప్రేమ్‌కుమార్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, సీనియర్ నాయకులు అపిరెడ్డి మాణిక్యం, గంటా శ్రీనివాసరావు, శివలంక మరిడేశ్వరరావు, కూనిశెట్టి దివాణం, గోవిందరావు, కూనిశెట్టి శివ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

▸▸ మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే బండారు



మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ యువతతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో అధిక శాతం యువతీ, యువకులు ఉన్నతంగా చదువుకుని నిరుద్యోగులుగా ఉండిపోతున్నారన్నారు. వారికి ఉద్యోగం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నియోజకవర్గంలో వచ్చే నాలుగేళ్లలో అత్యధిక శాతం మంది ఉద్యోగాలు పొంది, ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఏపీ సీడ్ జేడీఎం ఆళ్ల కల్యాణి మాట్లాడుతూ ఇక్కడ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న యువతీ, యువకులకు భోజనం, వసతితో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ మల్టీ నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలోని 13 ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగాలు కల్పించి నెలసరి వేతనం రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకు అందించనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే సూచన మేరకు డీఆర్‌డీఏ పీడీ కె.సచీదేవి పర్యవేక్షణలో ఈ జాబ్‌మేళా నిర్వహించినట్టు చెప్పారు. అనంతరం నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేముడు, డేటా ప్రో కంప్యూటర్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్‌కె.మహంతి, రాము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో..

▸▸ ఖాళీ బిందెలతో చలిసింగం ఆదివాసీ మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నినాదాలు చేస్తున్న చలిసింగం ఆదివాసీ మహిళలు

రావికమతం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గొంతెడుతున్న తమకు గుక్కెడు తాగునీరు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ చలిసింగం ఆదివాసీ మహిళలు గొంతెత్తారు. సోమవారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. వేసవి వస్తే తమను తాగునీటి ఎద్దడి వేధిస్తున్నదని, ఊటగెడ్డల్లోని కలుషిత నీటితో గొంతు తడుపుకుంటుని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జలజీవన్ పథకంలో మరో రూ.41 లక్షలు నిధులు మంజూరు చేసి దిగువన శికాయిపాడు వద్ద స్టోరేజీ ట్యాంకు నిర్మించి గ్రామంలో తాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టారని, ఫిబ్రవరిలో గ్రామ సందర్శనకు జిల్లా కలెక్టర్ రావడంతో ఆగమేఘాలపై పనులు చేపట్టారని, కలెక్టర్ వెళ్లిపోయిన తర్వాత పనులు నత్తనడకన సాగుతున్నాయని వారు తెలిపారు. దీంతో తమకు తాగునీటి కష్టాలు మొదటికే వచ్చాయని ఆదివాసీలు వాపోతున్నారు. ఈ వేసవిలో తాగునీరు ఇచ్చి సమస్య తీరుస్తామని చెప్పిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, తర్వాత గాలికొదిలేశారని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని చలిసింగం గిరిజన మహిళలు విన్నవించారు.

ఖాళీ ప్లేట్లతో పారిశుధ్య కార్మికుల ఆందోళన

బుచ్చెయ్యపేట: నెలలు తరబడి జీతాలు అందకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నామని పారిశుధ్య కార్మికులు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్‌వి.నాయుడు, సాంబశివరావు, ఏసు, బెల్లంకి నూకరాజు, బొర్రా అమ్మాజీ మాట్లాడుతూ వేతన బకాయిల అందక పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే బకాయిలు మంజూరు చేయాలని, కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

నలుగురు రెవెన్యూ సిబ్బంది బదిలీ

▸▸ విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఫలితం..?

గొలుగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న నలుగురు రెవెన్యూ సిబ్బందిని డిప్యుటేషన్‌పై ఇతర మండలాలకు బదిలీ చేయాలని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవోకు సోమవారం సిఫారసు వెళ్లినట్టు తెలిసింది. దీనిపై రెవెన్యూ అధికారుల తీరు బాగులేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి కొంత మంది రైతులు, టీడీపీ నాయకులు వారం రోజుల క్రితం తీసుకువచ్చారు. దీంతో స్పీకర్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్, ఆర్ఐ, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు మరో ఇద్దరు గ్రామ సచివాలయ సర్వేయర్ల జాబితాను సిద్ధం చేసి ఆర్డీవో కార్యాలయానికి పంపినట్టు సమాచారం. గొలుగొండలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌ను రావికమవతం మండలానికి, అటెండర్‌ను నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయానికి డిప్యూటేషన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మిగిలిన సిబ్బందికి ఏ మండలానికి పంపాలనేది అనుమతులు రావాల్సి ఉంది.

శ్మశాన వాటిక నిర్మాణానికి భూమి పూజ

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చోద్యం గ్రామంలో శ్మశానవాటిక నిర్మాణానికి సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటిక నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు దేవాడ శేషు, నాయకులు అడిగర్ల స్వామినాయుడు, ధర్మరాజు, చెన్నారెడ్డి, మాజీ బీసీసెల్ రాష్ట్ర డైరెక్టర్ బొండల రాజు, పంచాయతీ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

జూన్ 3న కోటమ్మతల్లి పండుగ

నాతవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మూడేళ్లకోసారి జరిగే గ్రామ ఆరాధ్యదైవం కోటమ్మతల్లి పండుగను జూన్ 3వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామ పెద్దలు, వేద పండితులు రామాలయంలో సోమవారం సమావేశమై ముహూర్తం ఖరారు చేశారు. జూన్ 2వ తేదిన అమ్మవారి రాట వేయాలని నిర్ణయించారు. అలాగే మే 6వ తేదిన కోటమ్మతల్లి ఘటాలు తీసి జూన్ 3న పండుగ జరిగే వరకు ప్రతి రోజూ నాతవరంలో ఊరేగింపు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి.కొండబాబు, రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, ఉప సర్పంచ్ కె.అప్పలరాజు, నాయకులు అంకంరెడ్డి రాంబాబు, ఎ.మాణిక్యం, ఎ.యర్రాపాత్రుడు, ఎ.రమణ పాల్గొన్నారు.

'అభివృద్ధిలో బీజేపీదే కీలక పాత్ర'

చీడికాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తున్నదని పార్టీ మండల అధ్యక్షుడు పాతాళం బాలకృష్ణ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని చీడికాడ, ఖండివరం, ఎల్‌బి.పట్నం, తునివలస, అర్జునగిరి గ్రామాల్లో సోమవారం జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత మోదికే దక్కుతుందన్నారు. ఈ పథకాలను పేదలకు అందేలా చూడాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొగ్గ ఈశ్వరప్రసాద్, రెడ్డి కొండబాబు, చిరువూరి శివాజీరాజు, మేడపురెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, సింగంపల్లి రమణమ్మ, పేరపు కొండబాబు, కెఎస్‌ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

▸▸ మండల సమావేశంలో తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నాగమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం మరీ సర్వే ప్రక్రియ మరలా మొదలైందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుసర్లపూడిలో జలజీవన్ మిషన్ పథకం కింద పనులు అసంపూర్తిగా వదిలేశారని, దీనిల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏవో విజయలక్ష్మి మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు శతశాతం పూర్తయితేనే రైతులకు రాయితీలు పడతాయన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు సాయం కింద నిధులను మంజూరు చేస్తుందని ఏఈ రామకృష్ణ చెప్పారు. అనంతరం అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీవో నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చింతపండు ధర పైపైకి..

▸▸ 30 కిలోలు రూ.3 వేలకు కొనుగోలు చేసిన వ్యాపారులు



మాడుగుల సంతలో విక్రయానికి తీసుకొచ్చిన చింతపండు

మాడుగుల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతలో చింతపండు ధరలు వారం వారం పెరిగిపోతున్నాయి. వ్యాపారులు తక్కువ రేటుకు అడుగుతున్నప్పటికీ, గిరిజనులు ససేమిరా అంటున్నారు. తాము చెప్పిన ధరకు తీసుకోండి.. లేదంటే ఇంటికి తిరిగి తీసుకెళతామని స్పష్టం చేస్తున్నారు. దీంతో వ్యాపారులు దిగివచ్చి గిరిజనులు చెప్పిన ధరలకు చింతపండు కొనుగోలు చేస్తున్నారు. మాడుగుల పక్కనే వున్న పాడేరు మండలం పులుసుమామిడి, కందులపాలెం, సలుగు, దేవాపురం, వంట్లమామిడి, కిక్కి, ఈదులపాలెం గ్రామాల గిరిజనులు సోమవారం ఇక్కడి సంతకు చింతపండును కావిళ్లు, గంపలతో తీసుకువచ్చారు. సుమారు 30 కిలోలు వుండే కావడి చింతపండును రూ.3 వేలు చెప్పారు. అయితే వ్యాపారులు రూ.2 వేలకు అడిగారు. గిట్టుబాటు కాదంటూ విక్రయానికి గిరిజనులు నిరాకరించారు. చేసేదిలేక వ్యాపారులు రూ.3 వేల చొప్పున చెల్లించి కొనుగోలు చేశారు. గత వారం కావడి చింతపండు రూ.2,500 పలకగా, ఈ వారం మరో రూ.500 పెరిగింది.

ఘనంగా ధర్మసాయి దేవాలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు

రోలుగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధర్మసాయి దేవాలయం 22వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచామృత అభిషేకాలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జి.చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోండి

▸▸ జిల్లా కలెక్టర్‌కు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాజు

రోలుగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట పొలాలకు నీరు అందించే చెరువును ఆక్రమించి అనధికారికంగా రోడ్డు వేసిన రాజన్నపేట క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి రాజు సోమవారం ఫిర్యాదు చేశారు. రైతుల పంటలపై అక్రమ క్వారీ తీవ్ర ప్రభావం చూపుతున్నందున రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సామర్థ్యానికి మించి అధిక లోడ్‌తో వాహనాలను నడుపుతూ వడ్డిప, బుచ్చెంపేట గ్రామాల్లో రోడ్లను ధ్వంసం చేస్తున్నారన్నారు.

బిడ్డతో సహా తల్లి అదృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెదరెల్లి వీధికి చెందిన పొట్నూరి నూకరాజు సోదరి గనిరెడ్డి నాగలక్ష్మి తన కుమార్తెతో సహా అదృశ్యమైంది. సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. అనకాపల్లికి చెందిన నాగలక్ష్మికి రాజమండ్రి సమీపంలో కడియంకు చెందిన అప్పలరాజుతో 2014లో వివాహమైంది. గత నెల ఏడో తేదీన భర్త అప్పలరాజుతో కడియంలో గొడవ జరగడంతో పుట్టింటికి నాగలక్ష్మి వచ్చింది. ఈ నెల ఐదో తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా కుమార్తెతో వెళ్లిపోయిందని ఆమె సోదరుడు నూకరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

కశింకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లి పంచాయతీ జంగాల కాలనీకి చెందిన పిల్లిబోయిన బ్యూలా (15) అనే బాలిక ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కేసులో నిందితుడ్ని సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన ఒమ్మి జయకృష్ణ అనే పెయింటర్ బ్యూలాను ప్రేమిస్తున్నానని వేధించడం వల్లే ఆమె మృతి చెందిందని తమకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అప్పటినుంచి పరారీలో ఉన్న జయకృష్ణను పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి గాలించారన్నారు. చివరకు సోమవారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని చెప్పారు.

ఎంపీడీవో కార్యాలయ మరమ్మతు పనులు పూర్తిచేయండి: పీఆర్ డీఈ

మాకవరపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ భవనం మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తిచేయాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈ ఈశ్వరరావు సూచించారు. ఈ పనులను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.6 లక్షలతో ఎంపీడీవో కార్యాలయ భవనానికి మరమ్మతులు చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

స్వశక్తితో అభివృద్ధి చెందాలి

దేవరాపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వశక్తితో అభివృద్ధి చెందాలని ఎంపీడీవో సువర్ణరాజు సూచించారు. సోమవారం జరిగిన వెలుగు యానిమేటర్ల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వెలుగు ఏపీఎం ప్రభాకర్, వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ, పశు వైద్యాధికారి మంజుషారాణి పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

గొలుగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో మేరీరోజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలకు 198 మంది హాజరయ్యారు. త్వరలో రుణాల మంజూరుకు చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వడ్డాది ఎస్సీ కాలనీలో తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు చెప్పారు. బాలిక అదృశ్యమైనట్టు గత నెల అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామన్నారు. బాలిక ఆచూకీ తెలుసుకుని సోమవారం కుటుంబీకులకు అప్పగించామని ఆయన చెప్పారు.

కృష్ణాదేవిపేటలో మజ్జిగ చలివేంద్రం


కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేటలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని బీజేపీ నాయకులు ప్రారంభించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బస్ స్టేషన్ వద్ద చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, ప్రజలకు పార్టీ మండల అధ్యక్షుడు చందక గౌరినాయుడు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిక్కిరెడ్డి రామదాసు, ఎస్.సాంబశివ, ఎ.దుర్గాప్రసాద్, లెక్క నాగేశ్వరరావు రమణ యాదవ్, కె.దుర్గాప్రసాద్, చంద్రరావు పాల్గొన్నారు.

ఉపాధి పథకం పనులు ప్రారంభం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేపీ.అగ్రహారం గ్రామంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు సోమవారం ఉపాధి పథకం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అద్దూరి శ్రీను, తూరుబిల్లి నూకరాజు, దేవర బూలినాయుడు, సుంకర శ్రీను, అద్దేపల్లి గోవింద, పడాల పెద్దరమణ, తాటికొండ నగేశ్, వియ్యపు ముసలినాయుడు పాల్గొన్నారు.

వీఎస్ఎస్‌లో అక్రమాలపై విచారణ జరపాలి

మాకవరపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గండిపేట వీఎస్ఎస్‌లో అక్రమాలపై విచారణ జరపాలని సర్పంచ్ రుత్తల నందకిశోర్ కోరారు. వీఎస్ఎస్‌లో జరుగుతున్న పనులకు, బ్యాంకు ఖాతాల్లో నగదుకు ఎటువంటి పొంతన లేదని, చాలా లావాదేవీలకు నగదు కనబడడం లేదని ఆయన ఆరోపించారు. ఇంత భారీ మొత్తంలో అవినీతి జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ఆయన కోరారు.



AJC CLASSIFIEDS

WALK-IN-INTERVIEW

★ Walk-in-Interview: 3 దశాబ్దాలుగా ISO సర్టిఫైడ్ అగ్రగామి సంస్థలో పనిచేయుటకు అర్జెంటుగా సిబ్బంది కావలెను. Regional Manager (5), Project Manager (10), B.D.Os (15). అర్హత: 30+ M/F & Full/పార్ట్‌టైమ్. Rtd., VRS, గెజిటెడ్, ఫైనాన్స్ ఇన్సూరెన్స్ రంగంలో అనుభవం గల వారికి, స్త్రీలకు ప్రాధాన్యత. Only Office work / No Field work. ఆదాయం: జీతం+ఇన్సెంటివ్స్+ కమిషన్ at the time of ఇంటర్వ్యూలో నిర్ణయించబడును. Ph: 8121100599 ఇంటర్వ్యూ ఈరోజు, రేపు.
AJV_231183

CHANGE OF NAME

★ I, ALLU YAMUNA W/o Allu Simhachalam, R/o Srikakulam, AP. ALLU YAMUNA and YAMUNA ALLU pertains to myself. Correct Name pattern is ALLU YAMUNA. Vide Afdvt dt 27.03.2025. AJH-526

CHANGE OF NAME / DATE OF BIRTH

I, Army No.02570700A, Rank. NK (TS), Name: VASA APPA RAO, Resident at D.No. 19-01-21, Pathaayyannapalem, Nadupuru High School, Pedagantyada Visakhapatnam, Andhra Pradesh -530044, hereby declare that in my Military Service Records my Wife's NAME was recorded as SINAPPAYAMMA and date of Birth as 36 years. But, my wife's correct NAME is VASA CHINNAPPAYYAMMA and date of birth is 13-July-1955 as per Aadhar & Pan card. vide affidavit dated 07-04-2025 sworn before notary at Visakhapatnam.

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

డిప్యూటీ సీఎం మన్యం బాట

▸▸ డుంబ్రిగుడ మండలంలో పర్యటన

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం ఏజెన్సీలో పర్యటించారు. డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ పెదపాడు ఆదిమ జాతి గిరిజన గ్రామాన్ని సందర్శించారు. అక్కడి గిరిజనులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం డుంబ్రిగుడలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'అడవితల్లి బాట' కార్యక్రమంలో భాగంగా పలు రహదారులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వికాస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయనకు గిరిజనులు బ్రహ్మరథం పట్టారు.

- డుంబ్రిగుడ/ఆంధ్రజ్యోతి


చాపరాయి దాటుతున్న దృశ్యం


డుంబ్రిగుడ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్. చిత్రంలో మంత్రి సంధ్యారాణి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దార్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర, తదితరులు


పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ మంత్రి మణికుమారి


డుంబ్రిగుడ సభకు హాజరైన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర, తదితరులు


వికాస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్, తదితరులు


పెదపాడు గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న దృశ్యం


గిరిజనులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


పెదపాడులో పాఠశాలను సందర్శించిన దృశ్యం


పెదపాడు గ్రామంలో విత్తనాల ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం


పెదపాడు గ్రామంలో గిరిజనులకు అభివాదం చేస్తున్న దృశ్యం


పెదపాడు గ్రామానికి నడిచి వెళుతున్న పవన్‌కల్యాణ్

మన్యంలో విభిన్న వాతావరణం

▸▸ ఉదయం మంచు-మధ్యాహ్నం ఎండ

▸▸ మూడు గంటల నుంచి ఆకాశం మేఘావృతం

పాడేరురూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మన్యంలో శనివారం విభిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం 7 గంటల వరకు దట్టమైన పొగమంచు కురవగా.. 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తీవ్రంగా ఎండకాసి ఉక్కపోతకు గురిచేసింది. మధ్యాహ్నం 2 గంటల తరువాత ఆకాశం మేఘావృతమై చల్లబడింది.

కొయ్యూరులో 37.4 డిగ్రీల ఉష్ణోగ్రత

కొయ్యూరు మండలంలో సోమవారం 37.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా పాడేరు, జీకేవీధిలో 36, పెదబయలులో 35.7, అరకువేలిలో 35.3, చింతపల్లిలో 34.7, హుకుంపేటలో 33.8, ముంచంగిపుట్టులో 33.2, అనంతగిరిలో 32.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అగ్ని ప్రమాద కుటుంబానికి ఆర్థిక సాయం

కొయ్యూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వంజరి ఆంజనేయులు కుటుంబానికి అదే గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ రూ. 10,116 ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నాడు. హైదరాబాద్‌లో ఉంటున్న తన స్నేహితుల సహకారంతో సత్యనారాయణ ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దుమంతి రామకృష్ణ, కాటం రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ పనులకు భూమి పూజ

జి.మాడుగుల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలమామిడి పంచాయతీ లక్కుశ్ల గ్రామంలో సోమవారం చెక్‌డ్యాం పనులకు సర్పంచ్ రామకృష్ణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రూ.19.5 లక్షలతో నిర్మించే చెక్‌డ్యాంతో గ్రామంలో పొలాలకు పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అప్పారావు, ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు, మాజీ సర్పంచులు భాస్కరరావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలి'

పాడేరురూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధిక ధరలతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్యాస్ గృహవినియోగ సిలిండర్‌పై రూ.50, పెట్రోలు, డీజిల్‌పై లీటరు రూ.2 పెంచిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయన్నారు. పెంచిన ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతులకు వ్యవసాయ రుణాలు : ఏవో

చింతపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు వ్యవసాయ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక మండల వ్యవసాయ అధికారి బి. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పెదబరడ ఆర్‌బీకే వద్ద రైతులకు వ్యవసాయ రుణాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ పెట్టుబడుల కోసం రుణాలు అవసరమైన రైతులు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈదరఖాస్తులను బ్యాంక్ అధికారులకు అందజేసి రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

గిరిజనులకు దుస్తులు పంపిణీ

చింతపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మంగులలో గూంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ అందజేసిన దుస్తులను స్థానిక సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య సోమవారం ఆదివాసీలకు అందజేశారు. ఈకార్యక్రమంలో గూంజ్ ప్రతినిధి బెదర కొండబాబు, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేపట్టిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు

పాడేరురూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ షేక్ జమీల్ బాషా ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడ నుంచి సినిమాహాలు సెంటర్ మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మాతా, శిశు మరణాలను నియంత్రించేందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యత చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, మినుములూరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తిలో పవన్‌కు నీరాజనం

... 5వ పేజీ తరువాయి

వచ్చిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 8.15 గంటలకు ఆయన విశాఖ చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, జనసేన నేతలు కోన తాతారావు, బొలిశెట్టి సత్యనారాయణ, పి.ఉషాకిరణ్, సుందరపు సతీశ్, బి.వసంతలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో డుంబ్రిగుడ బయలుదేరి వెళ్లారు.

రక్తపోటు, మధుమేహం

... 5వ పేజీ తరువాయి

బాధితులు రెట్టింపు అయినట్టు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఇక జిల్లాలో నోటి క్యాన్సర్‌తో 138 మంది, రొమ్ము క్యాన్సర్‌తో 144 మంది, గర్భాశయ సంబంధిత క్యాన్సర్‌తో 207 మంది బాధపడుతున్నట్టు గుర్తించారు. మానసిక పరిస్థితిపై నిర్వహించిన సర్వేలో 2,903 మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తేల్చారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో 191 మంది, కుష్ఠువ్యాధితో 48 మంది బాధపడుతున్నారు. జిల్లాలో క్షయతో బాధపడుతున్న వారు 2,345 మంది ఉన్నారు. వినికిడి సమస్యతో 1,380 మంది బాధపడుతున్నారని గుర్తించారు.

స్క్రీనింగ్ పరీక్షలు నిరంతర ప్రక్రియ

జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పరిధిలో స్క్రీనింగ్ పరీక్షలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రామ్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ప్రశాంతి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన సర్వే కార్యక్రమం కింద జూన్ చివరినాటికి అందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆ తరువాత కూడా పీహెచ్‌సీల పరిధిలో స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

లక్ష్యాన్ని మించి ఉపాధి

... 5వ పేజీ తరువాయి

పెంచి, సామాజిక వనాలు, రోడ్ల పక్కన నాటుతారు.

ఈ ఏడాది 127 లక్షల పనిదినాలు లక్ష్యం

జిల్లాలో ప్రస్తుత (2025-26) ఆర్థిక సంవత్సరంలో 127 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గ్రామాల్లో 215 పశువుల నీటి తొట్టెలు, 7,200 పంట కుంటలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో 451.5 కిలో మీటర్ల పంట కాలువల పునరుద్ధరణ, 977 చెరువుల అభివృద్ధి పనులు మంజూరయ్యాయని తెలిపారు.

త్వరితగతిన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం

▸▸ నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి ఆదివాసీలు ప్రాధాన్యం ఇవ్వాలి

▸▸ ఈఎంఆర్ పాఠశాలల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య

▸▸ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ డైరెక్టర్ సమిధా సింగ్

చింతపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లంబసింగిలో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాలు వేగవంతం చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ డైరెక్టర్ సుమిధా సింగ్ ఆదేశించారు. సోమవారం చింతపల్లి మండలంలో ఆమె పర్యటించారు. తొలుత గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాలను పరిశీలించారు. మ్యూజియం పనులు ఎందుకు నిలిచిపోయాయని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆమె ప్రశ్నించగా, నిర్మాణ పనులు జాప్యం కావడంతో తొలి టెండర్ రద్దు చేశామని, మలివిడత టెండర్లు పిలిచామని సమాధానం ఇచ్చారు. టెండర్ల ప్రక్రియ వెంటనే పూర్తి చేసి సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. రాజుబంద, జల్లూరుమెట్ట పీవీటీజీ గ్రామాలను సందర్శించిన ఆమె ఆదిమజాతి ఆదివాసీలు నిర్మించుకుంటున్న పీఎం జన్‌మన్ పక్కా గృహాలను పరిశీలించారు. అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని ఆమె ఆదేశించారు. తెరపల్లి గ్రామంలో ఆదివాసీలు సాగు చేస్తున్న కాఫీ తోటలను పరిశీలించారు. కాఫీ మొక్కల పూత ఆశాజనకంగా ఉండడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, అరకు కాఫీ రుచుల కోసం దేశ, విదేశీయులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. ఆదివాసీ రైతులు నాణ్యమైన కాఫీని ఉత్పత్తి చేయాలన్నారు. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. దేశ వ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలు ద్వారా ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో(పీవీటీజీ) ఎం.వెంకటేశ్వరరావు, ఏపీవో ప్రభాకర్, గురుకులం ఉప కార్యదర్శి డాక్టర్ ఎన్‌జీ కిశోర్ బాబు, టీడబ్ల్యూ డీఈఈ జి.రఘునాథరావు నాయుడు, ఏఈ యాదకిశోర్, ఏపీఆర్, ఈఎంఆర్ ప్రిన్సిపాల్స్ రామేశ్వరం, ఎంవీ రమణ, మనోజ్ కుమార్, ఎంఈవో గెమ్మెలి బోడం నాయుడు, ఉద్యానశాఖ హెచ్‌వో అరుణ కుమారి, సబ్ అసిస్టెంట్ ధర్మయ్య పాల్గొన్నారు.


చింతపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ సుమిధా సింగ్

రాయిగెడ్డ వంతెన పనులు వేగవంతం చేయాలి : గిడ్డి ఈశ్వరి


నిర్మాణ పనులను పరిశీలించిన గిడ్డి ఈశ్వరి తదితరులు

పాడేరురూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ రాయిగెడ్డ వద్ద మత్స్యగెడ్డపై నిర్మిస్తున్న వంతెన పనులను వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం ఆమె బొక్కెళ్ల-ఈ.కొత్తూరు గ్రామాల మధ్య మత్స్యగెడ్డపై రూ.5 కోట్లతో చేపడుతున్న వంతెన పనులను పరిశీలించారు. సుమారు 40 గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యాన్ని అందించే వంతెన పనులను నాణ్యంగా చేపట్టాలన్నారు. అనంతరం ఆమె గొండెలిలోని రామాలయాన్ని దర్శించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి బొర్రా విజయరాణి, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, నాయకులు శోభన్‌బాబు, రమణబాబు, అప్పలకొండ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


నుజ్జునుజ్జయిన కారు

పెదబయలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అరడకోట పంచాయతీ పరిధిలోని చుట్టుమెట్ట కాఫీ తోటల మలుపు వద్ద సోమవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పెదబయలు వైపు నుంచి వస్తున్న వ్యాన్, పాడేరు నుంచి వస్తున్న మారుతీ కారు చుట్టమెట్ట సమీపంలో మలుపు వద్ద ప్రమాదానికి గురయ్యాయి. వాహనాల్లో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోపే రెండు వాహనాలు కూడా ప్రదేశంలో లేవని ఎస్ఐ రమణ తెలిపారు. గతంలో కూడా ఆదే మలుపు వద్ద అనేక ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మలుపులో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గూడెంకొత్తవీధిలో భారీ వర్షం

గూడెంకొత్త వీధి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి మూడు గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షానికి ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరుకున్నది. వర్షం వల్ల ఆర్‌వీ నగర్ వారపు సంతలో వర్తకులు, వినియోగదాలు అవస్థలు పడ్డారు.

పెదవలసలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

మండలంలో పెదవలసలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి 516-ఈ పెదవలస మీదుగా వెళుతున్నది. అయితే గ్రామం కంటే 12 అడుగుల ఎత్తులో రహదారి నిర్మించడంతో సోమవారం కురిసిన వర్షపు నీరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోకి చేరింది. ఇప్పటికైన జాతీయ రహదారుల అధికారులు వర్షపు నీరు బయటకు పోయేందుకు మార్గాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చింతపల్లిలో...

మండలంలో ఓమోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండున్నర గంటల వరకు వర్షం పలు గ్రామాల్లో వర్షం కురిసింది. అయితే చింతపల్లిలో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. వర్షానికి అన్నవరం సంతలో వర్తకులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.


జీకేవీధిలో కురుస్తున్న వర్షం

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తరాదు

▸▸ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి సోమవారం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యల గురించి ఆరా తీశారు. ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అవసరం మేరకు చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీవో శిరీషారాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు..

... 5వ పేజీ తరువాయి

లిజ, అర్జి ప్రవల్లిక (వీరిద్దరు తల్లీ కూతుళ్లు) తీవ్రంగా గాయపడ్డారు. వెంకటలక్ష్మి, డి.విజయ, ఐ.వెన్నెల, జె.సాయిదుర్గ, జె.ధనలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పాయకరావుపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో జోగా పైడితల్లిది అల్లిపురం సింహాళవీధి. ఈమె జీవీఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసి రిటైర్ అయ్యారు. మరో మృతురాలు గుర్రాల రత్నం పాత పోస్టాఫీసు ప్రాంతంలో నివాసం వుంటున్నారు.

గర్నికంలో యువకుడి హత్య

... 5వ పేజీ తరువాయి

యువకులతో కలిసి స్నేహం చేస్తున్నాడు. అందరూ జులాయిగా తిరుగుతూ చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుంటారు. మద్యంతోపాటు గంజాయి సేవించే అలవాటు కూడా వుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో గొల్లలపాలెం వెళ్లే రోడ్డులో మద్యం సేవిస్తూ చిల్లర దొంగతనాల విషయమై ఘర్షణ పడ్డారు. కొద్దిసేపటి తరువాత ఎవరి దారిన వాళ్లు వెళుతున్నారు. ఈ క్రమంలో రావికమతానికి చెందిన ఒక యువకుడు, పవన్‌కుమార్ మళ్లీ గొడవ పడ్డారు. రావికమతం యువకుడు మద్యం సీసాను పగలగొట్టి పవన్‌కుమార్ గొంతుపైన, ఎడమవైపున ఛాతి భాగంలో పొడిచాడు. దీంతో పవన్‌కుమార్ తీవ్రరక్తస్రావంతో స్పృహకోల్పోయి మృతిచెందాడు. దీంతో మిగిలిన ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు.. కొద్ది సేపటి తరువాత అటుగా బహిర్భూమికి వెళుతున్న వ్యక్తులు.. రక్తపు మడుగులో పడిఉన్న పవన్‌కుమార్‌ను చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం చుట్టూ చెల్లాచెదురుగా పడిన వున్న 14 రూ.500 నోట్లను, హత్యకు ఉపయోగించిన మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్ వచ్చి పలు ఆధారాలు సేకరించింది. పవన్‌కుమార్‌తో గొడవ పడిన ముగ్గురిలో ఒక మైనర్ వున్నాడని, అనుమానితులుగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని సీఐ చెప్పారు. మృతదేహానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హతుడి తండ్రి త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కోటేశ్వరావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను
దేవాలయాల్లో వినియోగించాలి

▸ వ్యవసాయ, దేవదాయ శాఖ అధికారుల సమావేశంలో కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల్లో నైవేద్యం, ప్రసాదాల తయారీకి ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం వ్యవసాయ శాఖ, విశాఖ, అనకాపల్లి జిల్లాల దేవదాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రసాదాలు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న ఆహార దినుసుల వివరాలను తెలుసుకున్నారు. ఆలయాల్లో స్థానికంగా లభించే ప్రకృతి వ్యవసాయ పంటల ఉత్పత్తులను వినియోగించాలన్నారు. స్థానిక వ్యవసాయాధికారులతో సంప్రదించి నూరు శాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన దినుసులను వినియోగించాలన్నారు. ఈ రకమైన వ్యవసాయంపై రైతులకు వ్యవసాయాధికారులు చైతన్యవంతులను చేయాలని వివరించారు.

'వేసవిలో తాగునీటి సమస్య తలెత్తరాదు'

వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి సోమవారం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యల గురించి ఆరా తీశారు. ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అవసరం మేరకు చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీవో శిరీషారాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అందరికీ అవగాహన : డీఎస్పీ



సచివాలయ పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్‌పై పట్టణంలోని ప్రజలందరికీ అవగాహన కల్పించాలని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఇక్కడ వార్డు సచివాలయ పోలీసులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. శక్తి టీమ్స్‌కు ఈ యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. బాల్య వివాహాల నియంత్రణ, ఈవ్‌టీజింగ్ వంటివి ఏ విధంగా అరికట్టాలి, ఎక్కడైనా ఏదైనా సమస్య వస్తే వెంటనే 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారమిచ్చేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. అలాగే శక్తియాప్‌ను ప్రజలంతా డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. విద్యా సంస్థల్లో శక్తి వారియర్ గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క క్లాస్ రూమ్‌లో ఐదుగుర్ని శక్తి వారియర్‌గా ఎంపిక చేసి విద్యార్థినులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ టీవీ విజయ్ కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభం

కొత్తూరు/ కశింకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులో ఉపాధి హామీ పథకం పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పని కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. కొత్తూరు ప్రాంతంలో 560 మందికి జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనపర్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు నీటిపల్లి రాజు, పందల శ్రీనివాసరావు, బోడి సాయి, మోసూరు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోట మండలం పరవాడపాలెంలో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ బిలిజ మునిలినాయుడు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి , కూటమి నాయకులు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లు అమర్చే వారికి వేతనాలు పెంచాలి'

తుమ్మపాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు అమర్చే సిబ్బందికి వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం స్మార్ట్ మీటర్లు అమర్చే సిబ్బందితో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు అమర్చే వారికి తొలుత రూ.28వేలు వేతనాన్ని అందిస్తామని నేడు రూ.12,800లకు తగ్గించడం దారుణమన్నారు. దీనిపై న్యాయం చేయాలని అధికారులను నిలదీస్తున్న సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సబబు కాదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ అంశంపై చొరవ చూపాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, లక్ష్మీనారాయణ, బాబూరావు, నాగార్జున, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు విధిగా రావాలి

▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కిందిస్థాయి సిబ్బందిని పంపించొద్దు ▸ కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం ▸ 394 మంది అర్జీలు



కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అన్ని శాఖ జిల్లాస్థాయి అధికారులంతా విధిగా హాజరుకావాలని, దిగువస్థాయి సిబ్బందిని పంపించవద్దని కలెక్టర్ విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమెతో పాటు జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలను సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. కాగా పీజీఆర్ఎస్‌కు వచ్చిన విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల వద్దకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి వెళ్లి వారి వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమం ముగిసే సరికి 394 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

అర్జీలపై త్వరితగతిన విచారణ : ఎస్పీ

అనకాపల్లి రూరల్ : అర్జీలపై త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను ఆలకించి, పరిష్కారం నిమిత్తం అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం చూపాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 42 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ కార్యాలయంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

82వ వార్డులో వైసీపీ హయాంలో అక్రమాలపై జెడ్సీకి ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. 82వ వార్డులో 2019 నుంచి 2024 వరకు జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు వియ్యపు శ్రీనివాసరావు యాదవ్ జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణకు అర్జీని అందజేశారు. జీవీఎంసీ స్థలం లో ఉన్న చెట్లను వైసీపీ నాయకులు తొలగించి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. ప్రజలకు నీడనిచ్చే చెట్లను అక్రమంగా నరికివేయడం వల్ల ఆ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. తక్షణమే తగు చర్యలుతీసుకోవాలని ఆయన కోరారు. అలాగే టిడ్కో ఇంటి విషయంలో విజయరామరాజుపేటకు చెందిన బుదిరెడ్డి రాము ఫిర్యాదు చేశారు. గత టీడీపీ హయాంలో టిడ్కో గృహం మంజూరు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తనకు చెందిన ఇంటిని రద్దయినట్టు చెబుతున్నారని వాపోయారు. విచారణ జరిపి, తనకు కేటాయించిన ఇంటిని ఇప్పించాల్సిందిగా విన్నవించారు.



ఫిర్యాదు కాపీ అందిస్తున్న శ్రీనివాసరావు యాదవ్

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

▸ ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో డీఎంహెచ్‌వో రవికుమార్



వైద్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుని తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట గల ఆవరణలో అందరూ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఆరంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, డీఎల్‌వో బాలాజీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తుమ్మపాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆహార నియమాల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. వ్యాయామం ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం గర్భిణులు హై రిస్క్ నుంచి తప్పించుకునే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది మంగమ్మ, బి.సంగం, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తుమ్మపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో



కశింకోట మండలం తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో...

కశింకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ మనీషా మాట్లాడుతూ నవజాత శిశు మరణాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఏవీసుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



కూచిపూడి నృత్యం చేస్తున్న రాజమండ్రికి చెందిన చిన్నారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో ప్రదర్శితమవుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి విశాఖకు చెందిన మంజుశ్రీ నృత్యాలయ బృందం కూచిపూడి, శాస్త్రీయ నృత్యాలు ప్రశంసలు అందుకున్నాయి. అలాగే రాజమండ్రికి చెందిన లలిత నృత్యాలయ కళానికేతన్ బృందం సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు అలరించాయి. తొలుత స్టేడియంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి అర్చకులు పూజలు నిర్వహించి, హారతులిచ్చారు. అనంతరం ఈ ప్రదర్శనలను ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జి.సత్యనారాయణ, సకల గోవింద్, చదరం నాగేశ్వరరావు, సూరే సతీష్, విల్లూరి హరికృష్ణ, తాడి రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కార్పొరేటర్ శ్రీనివాస్

పరవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ మ్యాన్‌ప్యాక్చర్ అసోసియేషన్, మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పరవాడ, తానాం, లంకెలపాలెం హైస్కూళ్లలోని విద్యార్థులకు ఇటీవల చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు జెట్టి సుబ్బారావు, సూర్యదేవర అప్పారావు, మురళీ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అప్పలనాయుడు, శ్రీదేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డతో సహా తల్లి అదృశ్యం

▸ కేసు నమోదు చేసిన పోలీసులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెదరెల్లి వీధికి చెందిన పొట్నూరి నూకరాజు సోదరి గనిరెడ్డి నాగలక్ష్మి తన కుమార్తెతో సహా అదృశ్యమైంది. సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. అనకాపల్లికి చెందిన నాగలక్ష్మికి రాజమండ్రి సమీపంలో కడియంకు చెందిన అప్పలరాజుతో 2014లో వివాహమైంది. గత నెల ఏడో తేదీన భర్త అప్పలరాజుతో కడియంలో గొడవ జరగడంతో పుట్టింటికి నాగలక్ష్మి వచ్చింది. ఈ నెల ఐదో తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా కుమార్తెతో వెళ్లిపోయిందని ఆమె సోదరుడు నూకరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

కశింకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లి పంచాయతీ జంగాల కాలనీకి చెందిన పిల్లి బోయిన బ్యూలా (15) అనే బాలిక ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కేసులో నిందితుడ్ని సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన ఒమ్మి జయకృష్ణ అనే పెయింటర్ బ్యూలాను ప్రేమిస్తున్నానని వేధించడం వల్లే ఆమె మృతి చెందిందని తమకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అప్పటినుంచి పరారీలో ఉన్న జయకృష్ణను పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి గాలించారన్నారు. చివరకు సోమవారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని చెప్పారు.

20 మద్యం క్వార్టర్ బాటిళ్లు పట్టివేత


కొత్తూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం అనకాపల్లి మండలం పాపయ్యసంతపాలెం గ్రామ శివారున మాటువేశామన్నారు. ఇంతలో కుర్రు వెంకటరమణ అనే వ్యక్తి ఇరవై మద్యం బాటిళ్లను ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తుండడంతో పట్టుకున్నామన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆయనపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

17 మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

సబ్బవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల నాలుగో తేదీన నిర్వహించిన జాబ్ మేళాకు హాజరై సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా ర్థులు 17 మంది ఫార్మా, ఐటీ, ఇతర మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు 72 మంది జాబ్ మేళాకు హాజరు కాగా, పదిహేడు మంది అద్భుత ప్రతిభ చూపి ఉద్యోగాలు పొందరన్నారు. ఆమెతో పాటు అధ్యాపకులు, జేకేసీ కో-ఆర్డినేటర్ బి.శంకర్ అభినందించారు.



ఏసీబీ వలలో జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

▸ మరణ ధ్రువీకరణ పత్రానికి రూ.50 వేలు డిమాండ్

▸ రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడిన జోన్-5 అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్, సూపర్‌వైజర్

విశాఖపట్నం/జ్ఞానాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ జీవీఎంసీ జోన్-5 ప్రజారోగ్య విభాగం అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురానికి చెందిన మండల శ్రీని వాసరావు ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విశాఖలో పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఈ ఏడాది జనవరి ఒకటిన మర్రిపాలెం రైల్వే ట్రాక్ వద్ద ప్రమాదవశాత్తూ మరణించారు. శ్రీనివాసరావు మరణ ధ్రువీకరణపత్రం కోసం ఆయన కుమారుడు భానుప్రకాష్ జీవీ ఎంసీ జోన్-5 (జ్ఞానాపురం) కార్యాలయంలో ప్రజారోగ్య విభాగంలో జనన, మరణ నమోదు విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే సూపర్‌వైజర్ బరకాల వెంకటరమణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ దండి సత్యసూర్యనాగపూర్ణచంద్రశేఖర్‌ను కలిశారు. దీనికి రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.20 వేలు లంచం ఇస్తేనేగానీ పనిచేయబోమని స్పష్టం చేశారు.

లంచం ఇవ్వ డానికి ఇష్టపడని భానుప్రకాష్ ఈనెల ఐదున ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ అనుమతితో కేసు నమోదుచేసిన ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు సోమవారం సాయంత్రం పథకం ప్రకారం జోన్-5 కార్యాలయంలో మాటువేసి భానుప్రకాష్ నుంచి వెంకటరమణ, సత్యసూర్యనాగపూర్ణచంద్రశేఖర్‌లు లంచం తీసుకుం టుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశామని మంగళవారం రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు.

ఉత్సాహభరితంగా జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ



గెలుపొందిన జట్టుకు మెమెంటో అందిస్తున్న నాయకుడు గోవిందరావు

తుమ్మపాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాలలో ఇటీవల ప్రారంభమైన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 60 జట్లు తలపడుతున్నాయి. సోమవారం జరిగిన మ్యాచుల్లో గెలుపొందిన వారికి టీడీపీ సీనియర్ నాయకుడు ఆడారి గోవిందరావు మెమెంటోలు అందజేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రారంభమైన పోటీలు ఉల్లాసంగా సాగుతున్నట్టు చెప్పారు. నాయకులు కొత్తపల్లి జయరాజు, దిమ్మల అర్జునరావు, ప్రదీప్‌కుమార్, చంద్రశేఖర్, విజయ్ తదితులు పాల్గొన్నారు.

రజకులకు ఇళ్ల స్థలాల కోసం ఆందోళన

పరవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తానాం గ్రామంలో నివాసముంటున్న నిరుపేద రజక కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు సోమవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా పలువురు రజకులు ప్రభుత్వ స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. కొంతమంది స్థానిక నాయకులు వారిపై కక్షగట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. రజకులకు న్యాయం జరగకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రజక కుల నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరంలో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందిస్తున్న సర్పంచ్

సబ్బవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో మదర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలుత దీనిని సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు ప్రారంభించారు. ట్రస్టు చైర్మన్ వేదూరి సత్యగంగరాజు, తెలుగు యువత కార్యదర్శి రోమాల చంద్రశేఖర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, పల్ల సత్యనా రాయణ, గొంప అశోక్ కుమార్, బర్ల రమణ, ధనిమిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

AJC CLASSIFIEDS

WALK-IN-INTERVIEW

★ Walk-in-Interview: 3 దశాబ్దాలుగా ISO సర్టిఫైడ్ అగ్రగామి సంస్థలో పనిచేయుటకు అర్జెంటుగా సిబ్బంది కావలెను. Regional Manager (5), Project Manager (10), B.D.Os (15). అర్హత: 30+ M/F & Full/పార్ట్‌టైమ్. Rtd., VRS, గెజిటెడ్, ఫైనాన్స్ ఇన్సూరెన్స్ రంగంలో అనుభవం గల వారికి, స్త్రీలకు ప్రాధాన్యత. Only Office work / No Field work. ఆదాయం: జీతం+ఇన్సెంటివ్స్+ కమిషన్ at the time of ఇంటర్వ్యూలో నిర్ణయించబడును. Ph: 8121100599 ఇంటర్వ్యూ ఈరోజు, రేపు. AJV_231183

CHANGE OF NAME

★ I, ALLU YAMUNA W/o Allu Simhachalam, R/o Srikakulam, AP. ALLU YAMUNA and YAMUNA ALLU pertains to myself. Correct Name pattern is ALLU YAMUNA. Vide Afdvt dt 27.03.2025. AJH-526

For Advertisement Contact :
9963231176
9966165093

CHANGE OF NAME / DATE OF BIRTH

I, Army No.02570700A, Rank. NK (TS), Name: VASA APPA RAO, Resident at D.No. 19-01-21, Pathaayyannapalem, Nadupuru High School, Pedagantyada Visakhapatnam, Andhra Pradesh -530044, hereby declare that in my Military Service Records my Wife's NAME was recorded as SINAPPAYAMMA and date of Birth as 36 years. But, my wife's correct NAME is VASA CHINNAPPAYYAMMA and date of birth is 13-July-1955 as per Aadhar & Pan card. vide affidavit dated 07-04-2025 sworn before notary at Visakhapatnam.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి